


పలువురికి సిఐలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాకు చెందిన పలువురు ఎస్‌ఐలకు సిఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విశాఖ రేంజ్ ఐజి కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగోన్నతి పొందిన వారు 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని అందులో పేర్కొన్నారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో శ్రీకాకుళం సైబర్‌సెల్ ఎస్‌ఐ చింతాడ ప్రసాద్, శ్రీకాకుళం రూరల్ ఎస్‌ఐ అంబటి విజయ్ కుమార్, ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ ఊయిక రమేష్, పొందూరు ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు, శ్రీకాకుళం డిసిఆర్‌బి జి.శ్రీనివాసరావు ఉన్నారు.



ఆర్‌టిసికి... పండగ

- కలిసొచ్చిన సంక్రాంతి సీజన్
- 624 ప్రత్యేక బస్సుల ద్వారా రూ.1.21 కోట్ల ఆదాయం

సంక్రాంతి పండగ సీజన్ ఆర్‌టిసికి కలిసొచ్చింది. సాధారణ రోజుల్లో తిరిగే బస్సులతో పాటు ప్రత్యేక బస్సుల ద్వారా అదనపు ఆదాయం సమకూరింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, అమలాపురం తదితర ప్రాంతాలకు వేసిన ప్రత్యేక బస్సులతో భారీగా ఆదాయం వచ్చింది. ఆదాయం పెంపునకు ఆర్‌టిసి ఈసారి చేపట్టిన ప్రత్యేక చర్యలు ఫలించాయి. పండగ సీజన్‌లో సాధారణంగా అదనపు ఛార్జీలు వసూలు చేసే పరిస్థితి ఉండగా, ఈ ఏడాది సాధారణ ఛార్జీలతోనే బస్సులను నడిపింది. దీంతోపాటు రానుపోనూ టిక్కెట్లను రిజర్వు చేసుకుంటే పది శాతం రాయితీ సైతం కల్పించింది. దీంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఆర్‌టిసిలో ప్రయాణించేందుకు మొగ్గు చూపడంతో ఆర్‌టిసి గల్లా పెట్టె కాసులతో గలగలాడింది.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సాధారణ రోజుల్లో 350 బస్సులు తిరుగుతున్నాయి. ప్రతి ఏడాదీ సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈ ఏడాది జనవరి పది నుంచి జనవరి 22వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపింది. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 624 బస్సులను తిప్పారు. దీని ద్వారా రూ.1,21,20,975 ఆదాయం సమకూరింది. శ్రీకాకుళం-1 డిపో ద్వారా అత్యధికంగా రూ.35,55,908 ఆదాయం వచ్చింది. ఆర్‌టిసి వైపు ప్రయాణికులు పజలు మొగ్గు చూపడంతో ప్రయివేట్ ట్రావెల్స్, బస్సుల్లో రద్దీ బాగా తగ్గింది. దీంతో వారూ సాధారణ ధరలకే ప్రయాణికులను ఎక్కించుకున్నారు. మొత్తమ్మీద ఆర్‌టిసి చర్యలతో ప్రయివేట్ ట్రావెల్స్, బస్సుల దోపిడీకి కొంత అడ్డుకట్ట వేసినట్లయింది.

ఆదాయం పెరగడం ఆనందంగా ఉంది

పండగ నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పలు రూట్లలో ప్రత్యేక బస్సులను నడిపాం. సాధారణ ఛార్జీలు వసూలు, రాను పోనూ రిజర్వేషన్ టిక్కెట్లపై రాయితీ వంటి చర్యలతో ప్రజలు ఆర్‌టిసిని ఆదరించారు. ఆర్‌టిసి ఈ ఏడాది మంచి ఆదాయం రావడం ఆనందంగా ఉంది.

డిపోల వారీగా వచ్చిన ఆదాయ వివరాలు

డిపో	బస్సులు	ఆదాయం (రూపాయల్లో)
శ్రీకాకుళం-1	179	35,55,908
శ్రీకాకుళం-2	169	30,63,082
టెక్కలి	119	25,20,806
పలాస	157	29,81,179
మొత్తం	**624**	**1,21,20,975**



రాబోయే రోజుల్లోనూ ఆర్‌టిసి ఆదాయం పెంచడంతో, ప్రజలు ఆర్‌టిసి వైపు మొగ్గు చూపేలా మరిన్ని చర్యలు చేపడతాం.

- ఎ.విజయ్‌కుమార్, జిల్లా ప్రజారవాణా అధికారి

ఓటు... నిర్ణయాత్మక శక్తి

- యువత వృద్ధులను ఆదర్శంగా తీసుకోవాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



ఓటరు కార్డును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటు హక్కు భవిష్యత్ నిర్ణయాత్మక శక్తిగా నిలుస్తుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక బాపూజీ కళామందిర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకొని భాగస్వాములు కావాలన్నారు. ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడంతో పాటు మిగతా వారూ నమోదు చేసుకునేలా బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు ఉంటారని, ఎప్పుడైనా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 2,357 పోలింగ్ కేంద్రాల్లో శత శాతం పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తే 65, 70 శాతం మందే తమ హక్కు వినియోగించుకుంటే మిగిలిన ఏర్పాట్లు వృథాగా మిగిలి ప్రజా ధనం వృథా అవుతుందని తెలిపారు.

జాయింట్ కలెక్టర్, స్వీప్ నోడల్ అధికారి ఎం.నవీన్ మాట్లాడుతూ జీవితంలో ఒక వ్యక్తి 10 నుంచి 12 సార్లు మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కుకు అర్హులేనని స్పష్టం చేశారు. దేశాభివృద్ధి కోసం విధిగా ఓటు హక్కు వినియోగించుకొని సహకరించాలని కోరారు. ఆర్‌డిఒ, శ్రీకాకుళం నియోజకవర్గ ఎన్నికల అధికారి సిహెచ్.రంగయ్య ఓటు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం నూతనంగా ఓటు హక్కు కలిగిన యువతీ యువకులకు ఓటరు కార్డులను అందజేశారు. ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. తొలుత బాపూజీ కళామందిర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని కలెక్టర్, జెసి సందర్శించారు. పలు కళాశాలల విద్యార్థులు, ఓటర్లు, అధికారులు ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్, జెసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏడురోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, కె.వి అప్పలనాయుడు, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, సన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ జయరాం, జామి భీమశంకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ఓటర్లు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- ప్రదర్శనకు సిద్ధమైన 20 శకటాలు
- 16 ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు
- 254 మందికి ప్రశంసాపత్రాలు
- ఏర్పాట్లను పరిశీలించిన జెసి నవీన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి, ఇతర అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం ముస్తాబు అయింది. పతాకావిష్కరణతో పాటు సైనిక వందన స్వీకరణకు వేదికను సిద్ధం చేశారు. జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా 20 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన శకటాలను ప్రదర్శనకు సిద్ధం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు లబ్ధిదారులకు ఉపకరణాలు అందించేందుకు బ్యాంకర్లు, పలు సంక్షేమ రంగాలకు చెందిన ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన 16 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేశారు.

మువ్వన్నెల పతాకాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఎగురవేయనున్నారు. పతాకావిష్కరణ అనంతరం ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి సైనిక వందనాన్ని స్వీకరిస్తారు. అందుకోసం ప్రత్యేక శకటాన్ని సిద్ధం చేశారు. పోలీసుల సైనిక వందనం, విన్యాసాల ప్రదర్శన అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రధాన వేదిక ముందు ఈ కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలుస్తున్నారు. అధికారులు, వీక్షకులు కూర్చునేందుకు ప్రత్యేక వసతి ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా అభివృద్ధిని తెలియజేసేందుకు ఐటిడిఎ, డిఆర్‌డిఎ, అటవీశాఖ, పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖ, డ్వామా, వైద్యారోగ్య, విద్యాశాఖలతో పాటు మొత్తం 20 శకటాలను ప్రదర్శనకు సిద్ధం చేశారు. వాటిలో ఉత్తమ శకటాలకు బహుమతులు అందజేస్తారు. జిల్లావ్యాప్తంగా 72 ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 246 మంది ఉద్యోగులను ప్రశంసిస్తూ వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలను అందజేస్తారు. జిల్లా ప్రగతిని, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రసంగించనున్నారు.



సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక

ఏర్పాట్లు పరిశీలన

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పలు శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లు ప్రోటోకాల్ ప్రకారం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మైదానం అంతా పరిశుభ్రంగా సిద్ధం చేయాలన్నారు. ప్రజలందరూ వేడుకలను వీక్షించే విధంగా అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు విద్యాసాగర్, చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కవాతు రిహార్సల్స్ పరిశీలన

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న పోలీస్ కవాతు రిహార్సల్స్‌ను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం పరిశీలించారు. పరేడ్ కమాండర్ గౌరవ వందనం సమర్పించారు. రిహార్సల్స్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ బ్యాండు ప్రదర్శన బాగుందని చెప్తూ కొన్ని మార్పులు సూచించారు. కవాతు మరింత అద్భుతంగా నిర్వహించాలన్నారు. గణతంత్ర వేడుకలలకు ముఖ్య అతిథులు, ప్రజలు, విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, కె.ఎస్ వాసన్, సిఐ పి.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు సురేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

254 మందికి ప్రశంసాపత్రాలు

రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని అత్యుత్తమ సేవలందించిన ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలకు చెందిన 254 మందికి ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. వీరిలో 85 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 246 మందిని ఎంపిక చేయగా, ఏడు స్వచ్ఛంద సంస్థల నుంచి ఎనిమిది మందిని ఎంపిక చేశారు.

చంద్రబాబు స్క్రిప్టుతో షర్మిల విమర్శలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్టుతో పిసిసి అధ్యక్షులు షర్మిల సొంత అన్నపై విమర్శలు చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో రాణించాలంటే జగన్మోహన్ రెడ్డిని విమర్శించడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. జగన్‌పై చేసే విమర్శలను ప్రజలు విశ్వసించరని చెప్పారు. చంద్రబాబు పాలనలో తన సొంత వాళ్ల ప్రయోజనం కోసం ఏం చేశారు, ప్రజలకు ఏం చేశారు... జగన్ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిపుష్టి ఎలా కల్పించారో బేరీజు వేసుకోవాలని సూచించారు. ఎవరి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయో గుర్తించాలన్నారు. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ప్రత్యేక ప్యాకేజీ కావాలని సంతకం చేసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి అంశాల వారీ మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖ్యతతో వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రతిపక్షాలకు అధికారం కావాలని, వైసిపి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం కావాలన్నారు. ప్రజలు ఏదీ మరిచిపోరని, మరో 70 రోజుల్లో వారే అన్నింటికీ సమాధానం చెప్తారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు, జగన్ ప్రభుత్వాల్లో ఎవరి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయో ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు.

టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతు అంటూ స్వయంగా రాజీనామా లేఖ ఇచ్చారని, దాన్ని ఇప్పుడు స్పీకర్ ఆమోదించారని తెలిపారు. స్పీకర్ ఫార్మాట్‌లో లేఖ రాసిన ఆయన నేరుగా ఆమదాలవలసలో స్పీకర్ సీతారాంను కలిసి రాజీనామా విషయం చెప్పారన్నారు. రాజీనామా ఆమోదంలో రాజకీయాలకు తావులేదన్నారు. లోకేష్ ఖాళీగా ఉండి ట్వీట్లు పెడుతున్నాడని, 70 రోజుల్లో ఎవరు మేకప్, ఎవరు ప్యాకప్ అన్నది తెలుస్తుందన్నారు. పాదయాత్ర చేసి శ్రీకాకుళం రాకుండానే ఎందుకు ప్యాకప్ అయిపోయాడో లోకేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ఉత్తరాంధ్ర నుంచి అత్యధిక స్థానాలు గెలిచామని, ఇక్కడ్నుంచే తిరిగి ఎన్నికల పోరుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు మామిడి శ్రీకాంత్, తమ్మినేని చిరంజీవి నాగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై.వి సుబ్బారెడ్డి

ఎన్నికల శంఖారావానికి సంసిద్ధం

వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి

వైసిపి ఉత్తరాంధ్ర రీజియన్ పరిధిలోని నాయకులు, ప్రజాప్రతినిధులను వచ్చే ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఈనెల 27వ తేదీన భీమిలి నియోజకవర్గంలోని సంగివలసలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సభలో దిశా నిర్దేశం చేయడం ద్వారా భీమిలి నుంచి ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుడతారని చెప్పారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు మరోసారి తెలియజేసి వారిని ఉత్తేజితులను చేయడమే ఈ సభ ఉద్దేశమని చెప్పారు. ఈ సభలో ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఐదు వేలు చొప్పున రెండు లక్షల మంది వరకు ప్రజాప్రతినిధులు, గృహ సారథులకు స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. ఇలాంటి సభలే రాష్ట్రవ్యాప్తంగా మరో నాలుగుచోట్ల నిర్వహిస్తామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఈ సభ చారిత్రాత్మక సభగా ప్రజల గుండెల్లో నిలిచిపోవాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్, బిసి కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, రాజాపు హైమవతి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



వినతిపత్రం అందజేస్తున్న మహాలక్ష్మి

విఒఎల కాలపరిమతి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలనీ విఒఎల సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అసిరినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విఒఎల ఉపాధిని దెబ్బతీసేలా మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను తీసుకొచ్చి మానసిక వేదనకు గురిచేస్తోందని చెప్పారు. కొన్నేళ్లుగా సేవలందిస్తున్న విఒఎలను కాదని రాజకీయ నాయకులు తమకు ఇష్టం వచ్చిన వారిని నియమించుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం దుర్మార్గమన్నారు. ఈ ఉద్యోగాన్ని నమ్ముకుని అనేక మంది పనిచేస్తున్నారని చెప్పారు. ఈ సర్క్యులర్‌తో వారంతా రోడ్డున పడే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సంఘాలను విడగొట్టడం, కలపడం వంటి పనులు సెర్ప్ అధికారులే చేశారని చెప్పారు. ఇటువంటి చర్యల వల్ల మానవ వనరులకు విఘాతం కలుగుతుందన్నారు. ఎక్కువ సంఘాలున్న విఒల నుంచి తక్కువ సంఘాలున్న విఒలకు సర్దుబాటు చేయాలని, ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 15 సంఘాల్లోపు ఉన్న విఒల విఒఎలకు వేతనాలను నిలుపుదల చేసి విఒలను కలిపారని, దీనివల్ల అనేకమంది ఉపాధి కోల్పోయారని చెప్పారు. వయసు పైబడిన వారికి, అనారోగ్యంతో ఉన్న వారికి, వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి విఎఒలుగా నియమించాలని కోరారు. జెండర్, వయసు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలన్నారు. కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, ఉపాధి కోల్పోయిన విఒఎలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా మార్టుల్లో సరుకుల కొనుగోలుకు టార్గెట్ ఇచ్చే పద్ధతిని రద్దు చేయాలని, కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గేదెలు వంటివి పొదుపు సంఘాల మహిళలతో బలవంతంగా కొనిపించే పద్ధతి ఆపాలన్నారు. లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 30, 31 తేదీల్లో విజయవాడలో చేపట్టే ధర్నా, వంటావార్పు కార్యక్రమానికి విఒఎలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు డి.జోగారావు, జి.ఎర్రయ్య పాల్గొన్నారు.

సంక్రాంతి కానుక చెల్లించాలి

శ్రీకాకుళం అర్బన్ : మున్సిపల్ కార్మికులకు సంక్రాంతి కానుకగా రూ.వెయ్యి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ నంబరు 12ను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ చల్లా ఓబులేసును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 23న ప్రొసీడింగ్స్ ఇచ్చారని, ఈ జిఒ ఆధారంగా చెల్లింపులు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు ఎ.రాము, ఎ.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఊసే లేదు

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పలాస



25 మంది ఎంపీలను ఇస్తే కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక హోదా ఊసెత్తడం లేదని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. మండలంలోని రెంటికోటలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషతో కలిసి పార్టీ శ్రేణులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ వైసిపి ఎంపీలు ఢిల్లీలో షికార్లు చేసుకున్నారు తప్ప ప్రత్యేక హోదా గురించి పార్లమెంట్‌లో పల్లెత్తి మాట్లాడిన పాపాన పోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎవరైనా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసేందుకు వస్తే మంత్రులు, ఎమ్మెల్యేలు గద్దల్లా వాలిపోయి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు మద్యపాన నిషేధం చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మద్యంతో వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగేళ్లలో ఒక్క జాబ్ కేలండర్‌నూ విడుదల చేయలేదని విమర్శించారు. ఎన్నికల ముందు 2.30 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పి, అధికారంలోకొచ్చాక నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామన్న మంత్రి సీదిరి అప్పలరాజు ఇప్పుడేం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే లొత్తూరు రిజర్వాయర్‌ను పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీనిచ్చారు.

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ ఒకవైపు సిఎం విశాఖపట్నంలో పరిపాలన రాజధాని పేరిట కొండలను మింగేస్తుంటే, పలాసలో మంత్రి అప్పలరాజు తానూ తక్కువ కాదని కొండలు, గుట్టలు, వాగులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అనంతరం లొత్తూరు, రెంటికోట, కాంట్రగడ నుంచి టిడిపిలో చేరిన సుమారు 130 కుటుంబాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సభలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎల్.కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ, జనసేన నాయకులు వి.దుర్గారావు, మాజీ ఎంపిపి దువ్వాడ కృష్ణమూర్తి నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, మల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్


కోటబొమ్మాళి : ప్రతిజ్ఞ చేయిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర


శ్రీకాకుళం అర్బన్ : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - టెక్కలి

ప్రజాస్వామ్యంలో ఓటు కున్న హక్కుని తెలుసుకుని వాటిని వినియోగించుకోవాలని, ముఖ్యంగా ఓటు నమోదుపై ప్రజల్లో అవగాహన పెంచాలని టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాట్లాడారు. 18 దాటి ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, తహశీల్దార్ కురమాన ప్రవల్లికాప్రియ, కో-ఆర్డినేటర్ వి.లూకేపాల్, రామారావు, త్రినాథరావు, కందిగోళ్ల, ధర్మారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు. పాత నౌపడ సర్పంచ్ దల్లి లోకేశ్వరరెడ్డి, బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డిల ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల రవికుమార్ రెడ్డి, వర్ధన్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: తహశీల్దార్ కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రమీ, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, డిటి ఆర్.మధు, కె.రాము, ఆర్ఐలు శివ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పలాస: ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతిఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుంచి ఆర్‌డిసి కాంప్లెక్స్ వరకు పలు విద్యాసంస్థల విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరంకాశీబుగ్గ బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లలో చైతన్య వంతంగా ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిపౌరుడూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన ఓటు విలువ తెలిసి జాతి గౌరవాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, ఎన్నికల డిటి రాంబాబు, హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమారస్వామి, జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం చిన్నంనాయుడు పాల్గొన్నారు.

కవిటి : కవిటిలో నిర్వహించిన ర్యాలీ మానవహారంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ రామచంద్రరావు పాల్గొన్నారు. ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు అప్పల నరసమ్మ, ధనుంజయరావు, ఢిల్లేశ్వరరావు పర్యవేక్షణలో మాక్ ఎన్నికల విధానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరిత రమణమూర్తి, విఆర్‌ఒలు నారాయణ, కల్యాన, ఎస్ఐజే, బిఎస్ఆర్, కళ్యాణి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీలో ప్రిన్సిపాల్ డి.వి.రమణమూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒ కోర్సు రాము, పి.వి.రమణ, పద్మనాభం పాల్గొన్నారు. అలాగే ఎస్‌విఆర్ కళాశాలలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ జి.వి.జగన్నాథరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పోగోటి మోహనరావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రెవెన్యూ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ నిర్వహించిన ర్యాలీలో తహశీల్దార్ గురుప్రసాద్, డిటి శ్రీహరి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : తహశీల్దార్ కార్యాలయం నుంచి మెళియాపుట్టి కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ పి.చంద్రకుమార్, ఎంఇఒ దేవేందర్‌రావు, ఎస్ఐ టి.రాజేష్, డిటి బి.శంకరరావు పాల్గొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

స్థానిక జెసిఎ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటర్ల దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్‌కుమార్, జెసిఎ ప్రతినిధులు షణ్ముఖరావు, ఢిల్లేసు, నవీన్‌కుమార్, స్వరూప్‌కుమార్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఇందిరాగాంధీ కూడలి నుంచి అంబేద్కర్ కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో తహశీల్దార్ కె.ప్రవల్లికాప్రియ, అధికారులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: 18 ఏళ్లుపూర్తయిన యువతీ, యువకులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఓటరు నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి కోరారు. ఓటరు దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, టిడిపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొత్తకోట సింహాద్రి నాయుడు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కె.లక్ష్మి, గొర్లె అప్పలనాయుడు, విఆర్ఒలు అప్పలనాయుడు, రామస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆబోతుల జగదీష్ నాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ మీసాల గణేష్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం: ఓటుహక్కు ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొ.కెవిజిడి బాలాజీ అన్నారు. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరి సమక్షంలో ఓటుహక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఓఎస్‌డి ప్రొ.సుధాకర్ బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్ఒడి అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవికుమార్, అసోసియేట్ డీన్ రమణ, జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావు, పిఒలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఓటుహక్కు వజ్రాయుధమని తహశీల్దార్ ఎస్.గణపతి అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవిబాబు ఆధ్వర్యంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 500 మంది విద్యార్థులతో ప్రభుత్వ కళాశాల నుంచి మండల రెవెన్యూ ఆఫీసు వరకు పలు నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. వన్ వే ట్రాఫిక్ కూడలి వద్ద బాపూజీ విగ్రహానికి తహశీల్దార్ ఎస్.గణపతి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వాలంటీర్లతో పాటు డిటి మురళీధర్ నాయక్, రెవెన్యూ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు తిరుపతి రావు, దుర్గారావు, సందీప్, ఉపేంద్ర, ప్రజలు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ రమణారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తవిటి నాయుడు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే మండలంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాల పిల్లలకు ఓటరు జాబితాపై, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాఘూర్, తెలుగు అధ్యాపకులు పైలి శేఖర్, డిటి లక్ష్మణరావు, కార్యదర్శి కిరణ్ కుమార్, విఆర్ఒ అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జి.సిగడాం తహశీల్దార్ కార్యాలయం నుంచి మార్కెట్ వరకు కెజిబివి విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమం లో డిటి నిర్మల, ఎంపిడిఒ నిశ్మల, ఎపిఎం రామకృష్ణ నాయుడు, ఎఒఒ సత్యనారాయణ, విఆర్ఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: కింతలి ప్రభుత్వజూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.సునీత ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటుహక్కు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.వి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలం లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, విఆర్ఒ వేణుగోపాల్, సచివాలయం సిబ్బంది గీతాదుర్గాభవాని, మల్లేశ్వరరావు, లైబ్రేరియన్ కళ్యాణి, ఉపహార్ సంస్థ సిబ్బంది లోపింటి అప్పారావు, మోహన్, శ్రీను, అంగన్వాడీ సిబ్బంది జ్యోతిలక్ష్మి, భారతి, శోభ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరులో నిర్వహించిన ర్యాలీలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, డిటి వి.గిరిరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవిత్ర, ప్లస్ టూ ప్రిన్సిపాల్ పండా పాల్గొన్నారు.


పలాస : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


ఆమదాలవలస : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు


బూర్జ : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


సరుబుజ్జిలి : ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల విద్యార్థులు

పుస్తకావిష్కరణ సభకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: కామ్రేడ్ బమ్మిడి శ్రీరాములు రాసిన పుస్తకావిస్కరణ కార్యక్రమానికి సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, నెయ్యిల మోహనరావు గురువారం పలువురికి ఆహ్వానం పలికారు. మండలంలోని గల్లీ, శివరంపురం, బెండి, సీతాపురం, కొండవురు, పల్లిఊరు తదితర గ్రామాల్లో సంఘ సభ్యులను, వామపక్ష వాదులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాములు తన 90 ఏళ్ల జీవితంలో 70 ఏళ్లు కమ్యూనిస్టుగా, చేసిన పోరాటాలు అనుభవాలతో రాసిన పుస్తకాన్ని ఈ నెల 28న అతని స్వగ్రామం నగరంపల్లిలో ఆవిష్కరణ చేస్తారని అన్నారు. నాలుగులేళ్ళ అజ్ఞాతవాసం, రెండేళ్ళ జైలు జీవితం, అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. 90 ఏళ్లు దాటిని ఇప్పటికీ ప్రజాసంఘాల ఉద్యమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయన అనుసరించిన కార్యాచరణ నేటి, భవిష్యత్ సమాజ మార్పుకు ఉపయోగ పడుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రజాతంత్ర వాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభలో అడ్వకేట్, సీనియర్ జర్నలిస్టు కొండూరు వీరయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, గిరిజన ఉద్యమ నాయకులు ఎం.తిరుపతిరావు, సిపిఎం జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టి.భాస్కరరావు, ఎన్.భైరాగి, ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ, ఎస్.మల్లేసు పాల్గొన్నారు.

రేపు జయహో బిసి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్ : క్రమశిక్షణతో మెలుగుదాం...బాబును అధికారంలోకి తెద్దామని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. నగరంలో టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో పార్టీ అధిష్టానం ఆదేశాలను అనుసరించి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జగన్ ప్రజా వ్యతిరేకపాల నను ఎండగట్టాలన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఇప్పటికే ఓటమి భయం పట్టుకుందన్నారు. గడచిన 40 ఏళ్లుగా టిడిపి ప్రభుత్వం బిసిలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. 27న నియోజకవర్గంలో చేపట్టనున్న జయహో బిసి కార్యక్రమంలో పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, జామి భీమశంకర్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, పిఎంజెబాబు, సింతు సుధాకర్ పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - పొందూరు

మండలం రాపాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో గ్రామానికి చెందిన కొంచాడ సూరీడు ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే విషయంపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో గతేడాది జిల్లాపరిషత్ నిధుల నుండి రూ.3.50లక్షలు మంజూరు చేయడంతో గ్రామం శివారులో తాగునీటి బోరు వేయడం జరిగిందని తెలిపారు. ఈ బోరు నుంచి పైపుల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ చేయలేదు. పాఠశాలకు తాగునీరు సరఫరా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు పైపులు ద్వారా తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న సూరీడు

టిడిపి గెలుపునకు కృషి


టిడిపిలోకి ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

పలాస : రాష్ట్రంలో టిడిపి గెలుపు ఖాయమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష జోస్యం చెప్పారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మందస మండలం సొండిపూడి, బాలాజీపురం గ్రామాలకు చెందిన 45 కుటుంబాలు గురువారం వైసిపి నుంచి టిడిపిలోకి గురువారం చేరారు. వారికి గౌతు శిరీష పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలన అధ్వానంగా ఉందన్నారు. వాలంటీర్ల పెత్తనం చెలాయిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు తారాస్థాయికి చేరుకుందన్నారు. టిడిపి పార్టీలో చేరిన వారిలో వైసిపి సొండిపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడు అవుగాన ఈశ్వరరావు, కొనారి తాతారావు, కొనారి మాధవరావు, దూసి కుర్మారావు, జలుమురు సంతోష తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు చింతాడ లక్ష్మీనారాయణ, గువ్వాడ లక్ష్మనారాయణ, యానాది వాసు, టిడిపి మండలం అధ్యక్షుడు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య పాల్గొన్నారు.

'జ్ఞానభారతి' విద్యార్థుల కవాతు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలోని జ్ఞానభారతి సెకండరీ పాఠశాలలో గురువారం ముందస్తు గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యా సంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్ అధ్వర్యాన విద్యార్థులు దాసన్నపేట నుచి బస్టాండ్ వరకూ కవాతు చేస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, జాతియతా భావాలు పెంపొందడమే కాక, భావిభారత పౌరులుగా తిర్చిదిద్దబడతారని జోహర్ ఖాన్ అన్నారు. ర్యాలీలో ఎస్ఐ గోవిందరావు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని తెచ్చేందుకు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యుటివ్ ట్రస్టు వై.రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెచ్ఎం రషీద్ సుల్తాన్, ఎఒ ప్రేమ్‌సర్తాజ్ ఖాన్, మేనేజర్ ప్రమోద్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న విద్యార్థులు

లెనిన్ స్ఫూర్తితో కాకరాపల్లి ఉద్యమం

ప్రజాశక్తి - నౌపడ

అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలబడిన లెనిన్ స్ఫూర్తితో కాకరపల్లి ఉద్యమం కొనసాగించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాంద్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్రలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారుణ్య కేశవ అధ్యక్షతన విప్లవ నాయకుడు లెనిన్ శత వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో కాకరపల్లి ఉద్యమకారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ లెనిన్ అసమానతులు లేని సమాజ నిర్మాణం కోసం ప్రపంచ వినువీధుల్లో శ్రామిక జెండాను ఎగరవేశారని అన్నారు. మానవాళి పోరాట చరిత్రలోనే లెనిన్ నూతన శకాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. అదే విప్లవ స్ఫూర్తితో కాకరాపల్లి ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. ఉద్యమకారుల డిమాండ్ సాధనకు మత్స్యకారులు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షా శిబిరం నిర్విరామంగా సాగుతుందన్నారు. ప్రభుత్వం 1108 జిఒ రద్దు చేయాలని, ఉద్యమకారులపై అక్రమ కేసుల ఎత్తివేయాలని, వలస పెత్తందారులు అక్రమంగా తంపర భూముల్లో వేసిన రొయ్యల చెరువులు తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిర్వాసిత మత్స్యకారులకు ఆ భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కాకరాపల్లి పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వీరులు జీరు నాగేశ్వరరావు, సీరపు ఎర్రయ్య, బత్తిన బారికయ్యల ఆశయాలకు అనుగణంగానే మత్స్యకార రైతాంగ ఉద్యమం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు నంబారి వెంకట్రావు, డికెఎస్ నాయకులు ఉరజాన నానారావు, మత్స్యకార ఉద్యమ నాయకులు దమయంతి, చంద్రమ్మ, సింహాచలం, మురళి పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, ఉద్యమకారులు


పరిశీలిస్తున్న ఎంఇఒ-2 లావణ్య

ఎంఇఒ-2 పరిశీలన

రణస్థలం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎంఇఒ-2 బి.లావణ్య సూచించారు. మండల పరిధిలో మహంతిపాలెం పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్, అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, పోలింగ్ బూత్‌ల్లో అన్ని వసతులను సమకూర్చాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి రుచిగా, పరిశుభ్రంగా వండి పిల్లలకు పెట్టాలన్నారు. పాఠశాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను సూచించారు. ఈమెతో పాటు సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

బూర్జ : మండలం కొల్లివలస 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈనెల 26న మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఎఇ అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుత్తావల్లి, లాభాం, నారాయణపురం, చిన్నలంకాం, చీడివలస, గంగంపేట, కొల్లివలస, ఉప్పినివలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

విద్యావ్యవస్థలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. మండలంలోని అమలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవదాసు అధ్యక్షతన 55 మంది విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పట్టించుకోని ప్రభుత్వ పాఠశాలల్లో జగన్ ప్రభుత్వం సంస్కరణలు తీసుకొచ్చిందని అన్నారు. నాడు-నేడు పనులతో మౌలిక సదుపాయాలు కల్పించి కార్పొరేట్‌కు ధీటుగా ద్విభాషా విధానంలో మంచి విద్యా ప్రమాణాలు అందించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని సమకాలీన పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కరాడ గిరి, ఢిల్లీశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రత్నం బాలరాజు

సిఎస్‌పి రహదారిపై మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే


నిరసన వ్యక్తం చేస్తున్న సిటిజన్ ఫోరం సభ్యులు

ఆమదాలవలస : ఆమదాలవలస-శ్రీకాకుళం సిఎస్‌పి రహదారిపై జరుగుతున్న మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని సిటిజన్ ఫోరంసభ్యులు అన్నారు. గురువారం పురపాలక సంఘ పరిధిలో టింపని హైస్కూల్ వద్ద ప్రధాన రహదారిపై భారీ గుంతల వద్ద సిటిజన్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెజె మోహన్‌రావు, బొడ్డేపల్లి మోహనరావుల ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త రోడ్డు నుంచి పారిశ్రామికవాడ వద్ద వరకు రహదారి పాడై నాలుగేళ్లు కావస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఇదే గుంతల రహదారిపై గతంలో స్పీకర్ త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారని, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు నిత్యం ఇదే రహదారిపై ప్రయాణిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సుమారు నాలుగున్నరేళ్ల నుంచి ఈ రహదారిపై సుమారు 20 మందికిపైగా చనిపోయారని, మరో 36 మంది తీవ్ర గాయాలై రోడ్డున పడ్డారన్నారు. మరణించిన క్షతగాత్రుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన తెలియజేస్తున్న సమయంలో స్పీకర్ అదే రహదారిపై వెళ్లడాన్ని గమనించి సిటిజన్ ఫోరం సభ్యులు కారును నిలుపుదల చేసి స్పీకర్ స్పందించాలని నినాదాలు చేశారు. స్పీకర్ కాన్వాయ్ ఆగకుండా వెళ్లిపోవడంతో మిన్నకుండిపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సెక్రెటరీ సనపల అన్నాజీరావు, కార్యవర్గ సభ్యులు సింగూరు నర్సింగరావు, కె.షణ్ముఖరావు, వై.సత్యం, జి.జగన్నాథం పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - పొందూరు

తమ డిమాండ్ల సాధనకు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు రావాల్సిన డిఆర్ బకాయిలు, పిఆర్‌సి బకాయిలు, మెడికల్ బిల్లులు చెల్లింపులో జాప్యం వంటి పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ వై.వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మరావు, పిఎస్.ప్రకాశరావు, దండా సూరిబాబు, వాండ్రంగి దామోదరరావు, పొగిరి జగన్నాథం, సిహెచ్.ఆర్.కె.రంగారావు పాల్గొన్నారు.

రణస్థలం: ఫెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రణస్థలం, లావేరు మండలాల ఫెన్షనర్ల సంఘం అధ్యక్షులు పున్నాన నరసింహులు నాయుడు కోరారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పి.నరసింహనాయుడు, వై.పాపినాయుడు, విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధులు సిహెచ్ గోపాలరావు, మన్నే కృష్ణానందం, బాలి రామునాయుడు, రమణమూర్తి, పొన్నాడ సత్యనారాయణ, మీసాల వెంకటరమణ, మాడుగుల రామారావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆమదాలవలస: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం పెన్షనర్ల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై పెన్షనర్ల సంఘం నాయకులు సురవరపు సిమ్మి నాయుడు, హనుమంతు వెంకట సత్యనారాయణ, బొడ్డేపల్లి మోహనరావు, నానుపాత్రుని చంద్రశేఖరరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫెన్షనర్ల సంఘ సభ్యులు దాస్యం లక్ష్మణరావు, షణ్ముఖరావు, బెండి సూర్యనారాయణ, పి.వి. నరసింహులు, కర్నేన జనార్ధనరావు పాల్గొన్నారు.

పలాస: పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పలాస యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని మాధవరావు, నెమలిపురి అప్పారావు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కుమార్ నాయక్, బి.నరసింగరావు, దువ్వాడ ఆనందరావు, జగ్గారావు, సుడియా సత్యనారాయణ, ఎం.లక్ష్మీనారాయణ, ఆర్.సుందర్రావు, ఆర్.దుర్యోధన, ఆర్.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

టెక్కలి: పాత తాలూకా కేంద్రం వద్ద నిర్వహించిన ధర్నాలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి ధనుంజయరావు, దల్లి వీరాస్వామిరెడ్డి, బొడ్డ ఆయ్యబాబు, కోత ధర్మారావు, రెయ్యి పున్నయ్య, బసవల అప్పలస్వామి, కోరాడ మోహనరావు, ప్రదాన హరిశ్చంద్రరావు పాల్గొన్నారు. యుటిఎఫ్, ఎపిటిఎఫ్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావులు సంఘీభావం తెలిపారు. అనంతరం తహశీల్దార్ కె.ప్రవల్లికాప్రియ, సబ్ కలెక్టర్ ఎఒ రాజగోపాల్‌లను కలిసి వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు.


టెక్కలి రూరల్ : ఆందోళన చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - కోటబొమ్మాళి


మహేష్ (ఫైల్)

మండలంలోని ఎత్తురాళ్లపాడుకు చెందిన కెళ్ల మహేష్ (24) గురువారం హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేష్ తగరపువలసలో దీలిప్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అనారోగ్యం రిత్యా సంక్రాంతి ముందే గ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం విశాఖపట్నం వెళ్తున్నానని ఇంటి వద్ద చెప్పారు. అయితే సాయంత్రానికి ఎక్కడ నుంచి వచ్చాడో, ఏమీ జరిగిందో తెలియదు కానీ హరిశ్చంద్రపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద తన ద్విచక్రవాహనం నిలిపి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పలాస జెఆర్‌పి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యులు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు తండ్రి కృష్ణారావు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతినికి తల్లి శాంతమ్మ, ఇంటర్ చదువుతున్న చెల్లి స్వాతిలు ఉన్నారు. ప్రయోజకుడైన కుమారుడు కుటుంబాన్ని ఉద్ధరిస్తాడని ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, ఇంతలోనే ఈ అఘాయత్యాన్ని పునుకున్నాడని కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అందరిలో ఎంతో కలిసికట్టుగా ఉన్న మహేష్ ఇలా మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస రైల్వే ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

తిలక్‌నగర్‌లో పట్టపగలు చోరీ

రూ.1.50 లక్షలు అపహరణ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి తిలక్‌నగర్‌లో ఓ ఇంట్లో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాశీబుగ్గలో పెరడైజ్ రెస్టారెంట్ నడుపుతున్న వూన గోవింద్ కుటుంబం తిలక్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం ఎప్పటిలాగే గోవింద్ రెస్టారెంట్ నిర్వహణకు వెళ్లాడు. భార్య సోని బంధువుల ఇంటికి బరంపురం వెళ్లింది. గోవింద్ కుమార్తె రోషిణి ఒక్కరే ఇంటి వద్ద ఉన్నారు. ముందుగా అనాథాశ్రమానికి విరాళం అందించాలని ఓ వ్యక్తి ఇంటికి వచ్చారు. ఇంట్లో ఎవరు లేరని, విరాళాలు ఏమీ ఇవ్వలేమని రోషిని చెప్పి ఆయనను పంపేసింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భార్యాభర్తలు వలే ఇంటికి వచ్చి శుభలేఖ ఇవ్వాలని, ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం రోషిని జుట్టు, మెడ పట్టుకొని బలంగా దెబ్బలు కొట్టారు. అరిస్తే చంపేస్తామని బెదిరించారు. అనంతరం రోషిని చేతే ఇంట్లోని బిరువాలు, అరమర తాళాలు తీయించారు. మాకు బంగారం వద్దు... నగదు ఎక్కడెక్కడ ఉందో చూపించమని బెదిరించారు. ఎక్కడెక్కడ ఉన్న నగదునంతా దోచుకున్నారు. వీరు ద్విచక్ర వాహనంపై వెళ్లడం మాత్రం రోషిని చూసి బయట వారికి చెప్పడానికి, అరవడానికి ఓపికలేక తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. తండ్రి రెస్టారెంట్ నుంచి హుటాహుటిన ఇంటికి చేరుకొని పరిస్థితిని గమనించారు. ఇంట్లోని నగదు ఉంచిన ప్రాంతాలన్నీ పరిశీలించి రూ.1.50 లక్షల వరకు చోరీ గుర్తైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు : ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన మిస్త్రాన్ ఘంటా ఒడిశా నుంచి ఆంధ్రాకు ఆరు మద్యం బాటిళు నడుచుకొని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు మాతల రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద గురువారం పట్టుకున్నారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని మిస్త్రాన్ ఘంటా అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సి కాంతారావు తెలిపారు.

మహిళా సాధికారతే జగన్ లక్ష్యం

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి- లావేరు

మహిళా సాధికారితే సిఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌లు హాజరయ్యారు ఈ సందర్భంగా మండలంలో 17,553 మంది మహిళాసభ్యులకు రూ.15.19 కోట్లు చెక్కును అందించారు. ఎంపీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సిఎం జగన్మోహన్ రెడ్డి పలు పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అక్క చెల్లెమ్మల జీవితాల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యానికి సిఎం జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, ఎంపిపిడిఒ కె.సురేష్ కుమార్, తహశీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తి, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, గొర్లె అప్పలనాయుడు, ఎపిఎం మాధవిలత, మాజీ ఎంపిపి రాజీనాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

పూటకో మాట మార్చే చంద్రబాబును నమ్మొద్దని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే జగన్ నాయకత్వాన్ని మరోసారి సమర్థించి మేలు చేసే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. నగరంలోని అరసవల్లి, శ్రీకాకుళం రూరల్ మండలంలోని సింగుపురం, గార మండలంలోని తూలుగులో గురువారం నిర్వహించిన నాలుగో విడత అసరా నిధుల విడుదలకు సంబంధించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాల రుణాలను నాలుగు విడతల్లో చెల్లించామన్నారు. మహిళలకు ఆర్థికంగా భరోసా ఇస్తూనే, వారిని శక్తిమంతులను చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా బ్యాంకు బకాయిలు చెల్లిస్తామని చెప్పి మోసం చేశారని తెలిపారు. బాబు మాట తప్పడంతో మహిళలు బ్యాంకు మెట్లు ఎక్కలేకపోయారన్నారు. జగన్ పాదయాత్రలో మహిళా సంఘాలకు స్పష్టమైన హామీనిచ్చి నాలుగు విడతల్లో పూర్తి చేశారని తెలిపారు. సచివాలయాల రాకతో గ్రామాల్లో పాలన మారిందన్నారు. పేదలకు మంచి చేసిన జగన్ ప్రభుత్వంపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామాల్లో కుటుంబాలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ వైసిపి ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నారు. కార్యక్రమంలో యువ నేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిసిఎంఎస్ గొండు కృష్ణమూర్తి, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, ఎంపిపిలు గొండు రఘురాం, అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, జెడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ మార్పు ధర్మారావు, వైసిపి మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు, పీస గోపి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి ప్రసాదరావు

సమగ్ర దర్యాప్తు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో జరిగినటువంటి లోపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇటీవల కాలంలో నియమకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్ళేపల్లి రాంగోపాల్ కోరారు. ఈ మేరకు బి.ఆర్.అంబేద్కర్ విసి రజనిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు చేయకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లు, రోస్టర్ విధానం, ఉద్యోగోన్నతులో రిజర్వేషన్లు పాటించకపోవడంపై అన్ని శాఖల్లో సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, అంబేద్కర్ విశ్వవిద్యాలయం సాధన సమితి కోశాధికారి టొంపల రమణ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘ నాయకులు

బాల కార్మికులతో పనులు చేయించడం నేరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరమని జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ ధర్మాన సీతారాములు అన్నారు. గురువారం పట్టణంలో పలు దుకాణాలు, బట్టల షాపులు, మెకానిక్ షాపులు, రైల్వేస్టేషన్‌లో రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధిబాలలు, బాల కార్మికులను గుర్తించడం కోసం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణంలో ఒక షాపు వద్ద ఒక మైనర్ బాలికను గుర్తించి బాలికకు, బాలికను పనిలో పెట్టుకొన్న యజమానికి కౌన్సిలింగ్ నిర్వహించామని, తదుపరి చర్యలు నిమిత్తం బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశ పెట్టడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలలోపు బాలలను పనిలో పెట్టుకొన్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు. వీధి బాలలు, బాల కార్మికులను గుర్తిస్తే తక్షణమే 1098, 100, 112, 181 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ సింగూరు శ్రీనివాసరావు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.కేశవరావు, ఎల్.వెంకటరావు, కార్మికశాఖాధికారి శ్రీనివాసరావు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది సాయి, లక్ష్మి, సిఆర్‌పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మెకానిక్ షెడ్‌లో సిబ్బందిని విచారిస్తున్న సభ్యులు



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సెయింట్ జాన్స్ హైస్కూల్ 1998-2003 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఈ నెల 21న నుంచి హైస్కూల్ అభివృద్ధి పనులను చేపట్టారు. ప్రస్తుతం దేశ విదేశాల్లో వృత్తి నిపుణులుగా, స్థానికంగా ఉద్యోగాలు చేస్తున్న మిత్రులందరూ కలిసి ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించి, విందు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసి రోజంతా ఉల్లాసంగా గడిపారు. ప్రత్యేకంగా తోటి స్నేహితులకు సహాయ సహకారాలు అందించాలని, పాఠశాల ఉన్నతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, గురువుల యోగక్షేమాలు ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుని అడుగు ముందుకు వేద్దామని వినూత్నంగా కార్యక్రమాన్ని ముగించారని ఆనాటి హెచ్ఎం సిస్టర్ మగ్రేట్ అన్నమ్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చక్రధర్, వెంకటేష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడును కలిసిన నాయకులు

కలిసికట్టుగా ముందుకెళ్లాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వైసిపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల మధ్య ఎండగట్టేందుకు టిడిపి నాయకులు కలిసికట్టుగా పోరాడి వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అచ్చెన్నాయుడు నిమ్మాడలో తన క్యాంపు కార్యాయలంలో ఉన్నారన్న విషయం తెలుసుకున్న జీరుపేటకు చెందిన కార్యకర్తలు, నాయకులు జిల్లా నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున గురువారం చేరుకుని ఆయనను కలిశారు.



అవగాహన కల్పిస్తున్న అప్పారావు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కొత్తూరు

చట్టాలపై అవగాహన అవసరమని కొత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.అప్పారావు అన్నారు. మండలంలోని నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిఈడు పిల్లలో బడిలో ఉండాలన్నారు. 14 ఏళ్లలో బాల బాలికలను పనిలో పెట్టరాదని తల్లిదండ్రులకు, షాపు యజమానులకు సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎ.ధర్మారావు, జూనియర్ అసిస్టెంట్ సాయిరాం, ప్రధానోపాధ్యాయులు ఎస్.నిర్మల, న్యాయవాదులు టి.నూకరాజు, జ.శ్రీనివాసరావు, ఎస్ఐ శివాజీరెడ్డి పాల్గొన్నారు.

జనసేన నాయకుల పర్యటన

ప్రజాశక్తి- పలాస

మండలం జగన్నాథపురం గ్రామంలో జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం జనం జనం జనసేన ప్రభంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి జనసేన, టిడిపిని ఆశీర్వదించి మద్దతు తెలపాలని కోరారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న ఆఫ్ షోర్ జలాశయం పూర్తి చేసి ఎడమ కాలువ ద్వారా ఈ ప్రాంతానికి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోన కృష్ణారావు, లావేటి సురేష్, నందిగాం ధర్మారావు, బోడసంగి భాస్కరరావు, కొల్లి చక్రపాణి, టిడిపి నాయకులు మామిడి ధర్మారావు, సనపల గోపాలకృష్ణ, మూల ఆనందరావు, జనసైనికులు దువ్వాడ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' పరామర్శ

ఎల్ఎన్‌పేట : మండలంలోని సిద్ధాంతంకు చెందిన సుంకాన మల్లేశ్వరరావు తండ్రి కృష్ణమూర్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన వంగ నరసింహులు ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు విగిరిపోయింది. ఈయనను పరామర్శించారు. ఈయన వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గ పరిధిలో జిల్లా పంచాయతీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యాన 40 మంది యువకులు టిడిపిలో చేరారు. గార, శ్రీకాకుళం మండలాలతో పాటు నగరానికి చెందిన యువకులను టిడిపి కండువాలు వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. నగరంలో విశాఖ ఎ కాలనీలో ఉన్న ఆయన కార్యాలయంలో వారిని ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అందులో బాగంగా చంద్రబాబును తిరిగి సిఎంని చేయాలనే సంకల్పంతో పార్టీలో చేరేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో నగర మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్ అధ్వర్యాన వప్పంగి చెందిన బత్తిన నవీన్ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో భాషా షరీఫ్, జిల్లా టిడిపి కోశాధికారి ఇప్పిలి తిరుమలరావు, నాయకులు రెడ్డి శంకర్, ఉత్తరాంధ్ర కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుర్రి మధు, బొల్ల నాగేంద్ర యాదవ్, గార మండల పార్టీ అధ్యక్షులు గొండు వెంకట రమణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొండు శంకర్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని మండపల్లి పంచాయతీ బుడ్డెపుపేటకు చెందిన కొంతాల పద్మ కూతురు కొంతాల గాయత్రి కొద్ది రోజుల నుంచి బోన్ కాన్సర్‌తో బాధపడుతుంది. చిన్న వయసులోనే తన తండ్రి కుటుంబాన్ని వదిలి ఎటో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆ తల్లి అంతాతానై కూతురుని తన రెక్కల కష్టంతో ముందుకు నడిపించింది. ఈ తరుణంలో బోను కేన్సర్ వ్యాధి సోకిందని వైద్యులు చెప్పారు. ఆపరేషన్‌కు రూ.12 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో వారు దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010-11 చదివిన పదో తరగతి విద్యార్థులు తమ వంతు సాయంగా రూ.పది వేలు ఆర్థికసాయం గురువారం బాధిత కుటుంబానికి అందించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజల్లోకి టిడిపి మేనిఫెస్టో

ప్రజాశక్తి- పలాస

రానున్న ఎన్నికల్లో టిడిపి అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరించాలని నియోజకవర్గం సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 17, 18 వార్డుల్లో పల్లెపల్లెకు టిడిపి కార్యాక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు భూ కబ్జాలు, ఆక్రమణలు, అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. వైసిపి వ్యతిరేక ఓట్లపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో లోడగల కామేష్, గురుటి సూరినారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, పైల చక్రధర్, సప్ప నవీను, గాలి కృష్ణ, బడ్డ నాగరాజు, కొండే నరసింహులు, నాబిల్లి శ్రీను, బి.ఉమాకాంత్, యవ్వరి మోహనరావు, హనుమంతు మురళి, నర్సింహులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించిన కవిటి జట్టు

క్రికెట్ విజేత కవిటి

కవిటి: ఆడుదాం ఆంధ్రా నియోకవర్గస్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీలో ఇచ్ఛాపురం జట్టుపై కవిటి సచివాలయం-1 జట్టు విజయం సాధించి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, ఇఓఆర్డి శివాజీ పాణిగ్రాహి, ఎఒ శ్రీనివాస్‌రెడ్డి, ఇఒ వీరభద్రస్వామి అభినందనలు తెలిపారు.

ఆమె నేత్రాలు సజీవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్:

నగరంలో ప్రముఖ వైద్య నిపుణులు జి.విద్యాసాగర్ తల్లి గండి యశోదమ్మ(80) గురువారం ఉదయం కన్ను మూశారు. ఆమె కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ఆమె నేత్రాలను రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం అందజేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు ఆధ్వర్యాన మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వి.ప్రసాద్ నేత్రాలయానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. వైద్య సిబ్బంది పిసుజాత, పవన్ కుమార్, జగదీష్ పాల్గొన్నారు.



యశోదమ్మ (ఫైల్)

ద్రవజీవామృతం తయారీ

ప్రజాశక్తి- రణస్థలం

బొప్పాయి పంటకు పుష్కలంగా పోషకాలు అందించాలని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి బొప్పాయి రైతులకు సూచించారు. మండలం బంటుపల్లి గ్రామంలో వెలిసేటి అరుణ వాసరావు బొప్పాయి పంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొప్పాయి పంటకు మొక్కకు కావాల్సిన అన్ని రకాల పోషకాలను అందించడానికి ప్రతి 20 రోజులకు ఒకసారి 200 లీటర్ల ద్రవజీవామృతాన్ని నీటి ద్వారా పారించడంతో బొప్పాయికి పుష్కలంగా పోషకాలు అందించవచ్చునని పేర్కొన్నారు. అందులో భాగంగా 200 లీటర్ల ద్రవజీవామృతాన్ని రైతులకు అవగాహన పరుస్తూ తయారు చేయించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రసాయన ఎరువులను ఉపయోగించకుండా ద్రవజీవామృతాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో చేయడం వలన నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్త గిడిజాల సూర్యకాంత, రైతులు పాల్గొన్నారు.



ద్రవజీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

'అన్నా క్యాంటీన్'కు రూ.10 వేలు వితరణ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం ఆవరణలో పేదల కోసం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌కు సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురానికి చెందిన తంగి రమణమూర్తి కుమారుడు, కుమార్తె రామ్మోహన్ సాయి, జోస్న పుట్టిన రోజు సందర్భంగా గురువారం రూ. 10 వేలును వితరణగా అందజేశారు. పిల్లల పుట్టిరోజు సందర్భంగా పేద ప్రజలకు రూ.5లకే భోజనం అందించే నేపథ్యంలో రూ.10 వేలును అందజేశామని తెలిపారు. ఈ మొత్తాన్ని అనా క్యాంటీను నిర్వాహకులు లాడి శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, వెలమల కామేశ్వరరావు, నంబాళ్ల శ్రీనివాస్, పట్ట సింహాచలం పాల్గొన్నారు.



అన్నదానంలో వడ్డిస్తున్న రమణమూర్తి

రాష్ట్రంలో అరాచక పాలన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జాడుపల్లిలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫోస్టోతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రలో అరాచకాలకు అదుపు లేదన్నారు. ప్రజా వ్యతిరేక మోసపూరిత విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, జాడుపల్లి ఎంపిటిసి కదంబల సుజాత, రాజు, వసంతు, చాపర మాధవరావు, పరమేశ్వరరెడ్డి, చంద్రశేఖర్, అగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌లో నిబంధనలు పాటించాలి

ఆమదాలవలస: సచివాలయాల్లో పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని రిజిస్ట్రేషన్ల శాఖ సీనియర్ అసిస్టెంట్ కంచరాపు వెంకట్ రాజేష్ బాబు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గురువారం సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, ఎల్ఎన్ పేట సచివాలయ సిబ్బందికి జగనన్న గృహ నిర్మాణ రిజిస్ట్రేషన్‌లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరంగా ఉండేందుకు పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు సచివాలయం నుంచి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవగాహన సదస్సులో సబ్ రిజిస్టర్ బి.అరుణ, జూనియర్ అసిస్టెంట్ సీపాన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రవేశాలు

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ప్రవేశానికి తత్కాల్ అపరాధ రుసుం రూ.1000 చెల్లించి ఈనెల 31లోగా ప్రవేశం పొందవచ్చని డిఇఒ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నాయీబ్రాహ్మణుల హర్షం

కోటబొమ్మాళి: బిహార్ మాజీ ముఖ్యమంత్రి, నాయీబ్రాహ్మణుల ముద్దుబిడ్డ కర్పూరి ఠాగూర్‌కు కేంద్రప్రభుత్వం భారత రత్న ప్రకటించినందుకు జిల్లా నాయీబ్రహ్మణుల సంఘ ఉపాధ్యక్షులు నౌగాపు నాగరాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఠాగూరు వెనుకబడిన తరగతుల కోసం చేసిన కృషి గుర్తించి ఆయన శత జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించిందని అన్నారు. ఈయనతో పాటు జిల్లా నాయీబ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు కుప్పిలి వెంకటరావు, నౌగాపు అమ్మాజీరావు, గొల్ల పల్లి సంజీవరావు, ఇప్పిలి అప్పన్న, చిగురువలస శ్రీనివాసరావు, కనకరాజు, తెలగవలస మోహనరావు, నవిరి నరేష్, అరబింద్, తెలగవలస శంకర్, పి.రాందాస్ ఉన్నారు.

నేడు విజయవాడలో 'లౌకిక జన కవనం'

శ్రీకాకుళం అర్బన్ : సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఈనెల 26న విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో లౌకిక జన కవనం నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ కే.శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల నుంచి కవులు పాల్గొంటారని, ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిన సమస్యలైన ధరలు, నిరుద్యోగం, వ్యవసాయం గిట్టుబాటు కాకపోడం వంటి లౌకిక సమస్యలపై కవులు తమ గళమెత్తుతారని తెలిపారు. దేశంలో మతపరమైన విభజన ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలని బిజెపి పాలకులు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవడం కోసం ఈ జనకవనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా నుంచి పెద్దసంఖ్యలో కవులు హాజరు కావాలన్నారు.

'మధ్యాహ్న భోజనం' పరిశీలన

పొందూరు: మండలం ధర్మపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పనితీరును గురువారం ఎంఇఒ-2 పట్నాన రాజారావు పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యతను పరిశీలించేందుకు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు పలు పాఠాలను భోదించారు.

ఎన్‌వైకెలో వాలంటీర్లకు ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం అర్బన్: నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆదేశాల మేరకు జిల్లా నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 29, 30 తేదీల్లో వాలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్టు కో-ఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 29న ఇచ్ఛాపురం, మందస, కాశీబుగ్గ, కొత్తూరు, కోటబొమ్మాళి, టెక్కలి బ్లాకులు, 30న నరసన్నపేట, సారవకోట, గార, ఆముదాలవలస, ఎస్.ఎం.పురం, రణస్థలం బ్లాకులకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇంటర్వ్యూల్లో పాల్గొనే వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్‌దరఖాస్తు జిరాక్స్‌లు, ఫోటోలతో హాజరు కావాలన్నారు.